సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

9705347494

నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

విద్యార్థిని వైద్యానికి ఆర్థిక సాయం



విద్యార్థిని నిత్యశ్రీకు రూ.10 వేలు అందిస్తున్న ఫ్యాబ్ ప్రతినిధులు

భీమునిపట్నం : భీమిలి తోటవీధికి చెందిన విద్యార్థినికి స్థానిక ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆఫ్ భీమిలి (ఫ్యాబ్) సభ్యులు బుధవారం ఆర్థిక సాయం అందించారు. రాకోతు నిత్యశ్రీ అనే డిగ్రీ విద్యార్థిని హృదయానికి సంబంధించిన సమస్యతో బాధపడుతోంది. ఆమెకు హైదరాబాద్‌లో లేజర్ చికిత్స అందించాల్సి వుండగా రూ.2 లక్షల వరకు ఖర్చవుతుందని వైద్యులు చెప్పారు. విషయం తెలుసుకున్న ఫ్యాబ్ సభ్యులు కాళ్ల సన్నీ, ముసునూరి శ్రీనివాస్, కట్టమూరి రమణారావు, మారోజు గోపి ఆమెకు రూ.10 వేలు అందించారు.

ఉపాధ్యాయునికి సత్కారం



తిరుపతిరాజును సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

కొమ్మాది : జీవీఎంసీ 8వ వార్డు ఎండాడ జిల్లా పరిషత్ హైస్కూల్‌లో సోషల్ టీచర్‌గా విధులు నిర్వహించిన ఇ.తిరుపతిరాజు బుధవారం ఉద్యోగ విరమణ సందర్భంగా పాఠశాల యాజమాన్యం, విద్యార్థులు ఘనంగా సత్కరించారు. ముందుగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శైలజ ఆధ్వర్యంలో తిరుపతిరావును శాలువాతో సత్కరించారు. పాఠశాలకు ఆయన చేసిన సేవలను, విద్యార్థులకు నేర్పిన క్రమశిక్షణను గుర్తు చేసుకున్నారు. ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

పీఎంసీ చైర్‌పర్సన్‌కు సన్మానం



నీలమ్మను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

మధురవాడ : జీవీఎంసీ 7వ వార్డు వాంబే కాలనీ సునీల్ శర్మ కాలనీలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పాఠశాల కమిటీ చైర్ పర్సన్ నీలమ్మ, వైస్ చైర్మన్ శంకర్‌ను ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా సత్కరించారు. పాఠశాలలో బుధవారం సాయంత్రం నిర్వహించిన కార్యక్రమంలో హెచ్‌ఎం కె.గీతాదేవి, ఉపాధ్యాయులు శాలువాలతో సత్కరించి, వారి సేవలను కొనియాడారు. పాఠశాల అభివృద్ధికి వీరు అందించిన సేవలు అభినందనీయమన్నారు. మౌలిక సదుపాయాల కల్పన, తల్లిదండ్రులకు అవగాహన కల్పించడంలో వీరి పాత్ర కీలకమన్నారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఫీజు రాయితీతో ఉన్నత విద్య కోసం ఒప్పందం



మెస్సర్స్ అన్ అకాడమీ ఇన్‌స్టిట్యూట్ సభ్యులతో కళింగ నేవల్ స్టేషన్ ప్రతినిధులు

తగరపువలస : ఇండియన్ నేవల్ సిబ్బంది, వారిపై ఆధారపడే వారి కోసం తూర్పు తీర నేవల్ స్టేషన్ కళింగ – భీమిలి అధికారులు ఉన్నత విద్య కోసం బుధవారం అన్ అకాడమీ ఇన్‌స్టిట్యూట్ ప్రతినిధులతో అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నారు. ఉన్నత విద్యను అందుబాటు ధరలలో కోర్సులపై 55 శాతం రాయితీ అందించడానికి ఈ అవగాహన ఒప్పందం దోహదపడుతుందని స్టేషన్ కమాండింగ్ అధికారి ప్రదీప్ పటేల్ తెలిపారు. కార్యక్రమంలో అన్ అకాడమీ విశాఖ బిజినెస్ హెడ్ రఘురాం, తదితరులు పాల్గొన్నారు.

సాక్షి

మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు

భీమిలి

✆ 9493185214



శిథిలమై నిరుపయోగంగా మారిన టాయిలెట్లు



ఆనందపురం ఎంఈవో కార్యాలయం నిర్వహిస్తున్న శిథిల భవనం



సరైన కిటికీలు లేని ఎంఈవో కార్యాలయ గది

అడుగు పెట్టాలంటే భయం

- శిథిల భవనంలో ఆనందపురం ఎంఈవో కార్యాలయ నిర్వహణ
- ఎప్పుడేం జరుగుతుందోనని భయపడుతున్న ఉపాధ్యాయులు

తగరపువలస : పాతికేళ్ల క్రితం ఆనందపురంలో నిర్మించిన మండల రిసోర్స్ భవనం ప్రస్తుతం పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. ఈ భవనంలోనే మండల విద్యాశాఖ కార్యాలయాన్ని నిర్వహిస్తున్నారు. బయట నుంచి చూసేవారికి బూత్ బంగ్లాలా కనిపిస్తున్న ఈ భవనానికి సరైన తలుపులు, కిటికీలు లేవు. గట్టిగా తోస్తే ఊడిపోయే వీటితో లోపల ఉన్న స్టేషనరీ, మండలంలోని 65 ప్రాథమిక, 5 ప్రాథమికోన్నత, 12 జెడ్పీ హైస్కూళ్లకు చెందిన 4,764 మంది విద్యార్థులకు సంబంధించిన మెటీరియల్‌ను అతి కష్టం మీద రక్షించుకోవాల్సి వస్తోంది. ఈ పాఠశాలల్లో పనిచేస్తున్న 260 మంది ఉపాధ్యాయులు వివిధ అవసరాలకు ఎంఈవో కార్యాలయానికి వచ్చినా ఎప్పుడు ఏ కిటికీ, తలుపు, శ్లాబు పెచ్చులు ఊడి మీద పడతాయోనని భయపడుతుంటారు. కార్యాలయానికి సంబంధించిన టాయిలెట్లు పూర్తిగా పనికిరాకుండా పోవడంతో ఇక్కడికి వచ్చే ఉపాధ్యాయులు, సిబ్బంది బాధలు వర్ణణాతీతం. దీనికితోడు ఈ భవనం చుట్టూ తుప్పలు, పుట్టలు పెరిగిపోయి పరిసరాలు అడవిని తలపిస్తున్నాయి. దీంతో ఇక్కడ చెట్లు, తుప్పల మీద నుంచి విష పురుగులు నిత్యం కార్యాలయంలో సంచరిస్తున్నాయి. వీటికి భయపడి కూడా చాలా మంది ఉపాధ్యాయులు కార్యాలయం లోపలికి రావడం లేదు.



శ్లాబు పెచ్చులూడిన భవనం

దాతలు, స్వచ్ఛంద సంస్థలైనా నిర్మించాలి

సాధారణంగా పాఠశాల భవనాలు నిర్మించడానికి ముందుకు వచ్చే దాతలు, స్వచ్ఛంద సంస్థలు ఈ మండల విద్యాశాఖాధికారి కార్యాలయాన్ని నిర్మించడానికి ఆసక్తి చూపడం లేదు. మండలంలో ఇంచుమించు అన్ని పాఠశాలల్లో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నాడు – నేడు పథకం ద్వారా వసతులు కల్పించి ఆధునికీకరించింది. దీంతో దాతలు స్పందించి ఎంఈవో కార్యాలయానికి కనీస మరమ్మతులు నిర్వహించి వినియోగానికి వీలుగా మార్చాలని ఉపాధ్యాయులు కోరుతున్నారు. భవనం చుట్టూ భయానకంగా ఉన్న చెట్లు, పుట్టలు తొలగించాలంటున్నారు. విద్యాశాఖకు సంబంధించిన సమావేశాలు నిర్వహించుకోవడానికి దగ్గరలోని ఎంపీడీవో కార్యాలయానికి వెళ్లాల్సి వస్తోందని వాపోతున్నారు. తుమ్మితే ఊడిపోయే ముక్కులా ఉన్న కార్యాలయాన్ని పునర్నిర్మించాలని ఉపాధ్యాయులు, ఎంఈవో కార్యాలయ సిబ్బంది కోరుతున్నారు.



స్టేషనరీ భద్రపరిచే గదికి రక్షణ లేని దృశ్యం

విద్యుత్ సరఫరాకు రేపు అంతరాయం

మధురవాడ : మారికవలస ఇండస్ట్రియల్ 11 కేవీ ఫీడర్ పరిధిలో నిర్వహణ, మరమ్మతులు చేపడుతున్నందున శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 వరకు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని కొమ్మాది ఏఈఈ నరేష్ చెప్పారు. మారికవలస జంక్షన్, **మారికవలస** గ్రామం, బోరవానిపాలెం, మారికవలస **జేఎన్ఎన్**యూఆర్ రాజీవ్ గృహకల్ప కాలనీ, **డ్రైవర్స్ కాలనీ,** కొత్త పరదేశిపాలెం, పాత పరదేశి **పాలెం, జేకే లే** అవుట్ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ **సరఫరా నిలిచిపో**తోంది.

- **మధురవాడ** ఐటీ సెజ్ హిల్ నంబర్ – 1 ఫీడర్ **పరిధిలో** నిర్వహణ, మరమ్మతుల కారణంగా అయోధ్యనగర్, ఆర్టీసీ కాలనీ, మానం ఆంజనేయులు కాలనీ, సాక్షి పేపర్ ఆఫీసు, నగరంపాలెం పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని ఏఈఈ ఎస్‌వీఎస్ రామమూర్తి చెప్పారు.
- పీఎంపాలెం 11 కేవీ ఫీడర్, పెప్సీ కంపెనీ వద్ద ఫీడర్ పరిధిలో నిర్వహణ, చెట్ల కొమ్మలు తొలగింపు పనులు కారణంగా గాయత్రినగర్, గాయత్రినగర్ జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీ, ఏపీహెచ్‌బీ కాలనీ, పిలకవానిపాలెం, సాంకేతిక కాలేజీ రోడ్డు, పోస్ట్ ఆఫీసు ఏరియా పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని ఏఈ మండల అప్పలనాయుడు చెప్పారు.

భూములు కోల్పోయిన రైతుల వంటా వార్పు



బక్కన్నపాలెంలో సీఎం చంద్రబాబు, పవన్, గంటా ఫ్లెక్సీల వద్ద నిరసన తెలుపుతున్న రైతులు

- సీఎం చంద్రబాబు, పవన్, గంటా ఫ్లెక్సీలతో నిరసన

మధురవాడ : జీవీఎంసీ 6వ వార్డు కొమ్మాది నవోదయ వద్ద ప్రభుత్వ సంస్థల భవనాల నిర్మాణం కారణంగా భూములు కోల్పోయిన కొమ్మాది, బక్కన్నపాలెం, రేవళ్లపాలెం గ్రామాల రైతులు బుధవారం వంటా వార్పు చేసి నిరసన తెలిపారు. అనంతరం సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఫ్లెక్సీలు పెట్టి నిరసన తెలిపారు. బక్కన్నపాలెంలో సినీ పరిశ్రమ నిర్మించిన ఎన్టీఆర్ హుద్‌హుద్ గృహ సముదాయం వద్ద కొద్ది రోజులుగా రైతులు వివిధ రూపాల్లో నిరసన తెలుపుతున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతుల భూములకు ఏమాత్రం నష్ట పరిహారం ఇవ్వకుండా తీసుకున్నారని, కనీసం కాలనీ ఇళ్లయినా ఇచ్చి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. పేద దళిత, బీసీ రైతుల పట్ల ఇంత నిర్లక్ష్యం సరికాదన్నారు. కార్యక్రమంలో బంక.పోతురాజు, ఎస్.పైడిరాజు, డి.అప్పలరాజు, ఎస్.పైడితల్లి, నాగరాజు, దుర్గ, కుమారి, అరుణ పాల్గొన్నారు.

వసతి గృహాల మెస్ చార్జీలు పెంచాలి

తగరపువలస : ప్రస్తుత ధరలకు అనుగుణంగా వసతి గృహాల్లో మెస్ చార్జీలను ప్రతి విద్యార్థికి రూ.2500కు పెంచడంతోపాటు పెండింగ్‌లో ఉన్న కాస్మోటిక్ చార్జీలు విడుదల చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి యు.నాగరాజు డిమాండ్ చేశారు. భీమిలిలోని వెనుకబడిన తరగతుల బాలికల కళాశాల వసతి గృహంతోపాటు, బాలుర వసతి గృహాన్ని బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులతో మాట్లాడుతూ మెనూ ప్రకారం భోజనాలు పెడుతున్నారా..? లేదా..? అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారితో కలిసి భోజనం రుచి చూశారు. ప్రతీ వసతి గృహానికి శాశ్వతంగా వార్డెన్, కుక్, కమాటీ, ట్యూటర్, వాచ్‌మన్ పోస్టులను భర్తీ చేయాలని కోరారు. వసతి గృహాలకు సొంత భవనాలు నిర్మించడంతో పాటు శిథిలమైన వాటికి మరమ్మతులు నిర్వహించాలన్నారు. అక్కడే ఉన్న వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ శ్రీదేవి మాట్లాడుతూ ఈ సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ఎన్.శ్రీను, శేఖర్, మధు పాల్గొన్నారు.



భీమిలిలోని బాలికల కళాశాల వసతిగృహంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు

హౌసింగ్ కాలనీకి విద్యుత్ సదుపాయం కల్పించండి

సీతమ్మధార: బక్కన్నపాలెం హుద్‌హుద్ హౌసింగ్ కాలనీలో విద్యుత్ సరఫరా లేక ఇబ్బందులకు గురవుతున్నామని నివాసులు వాపోయారు. తమ కాలనీకి విద్యుత్ సరఫరా సదుపాయం కల్పించాలని కోరుతూ బుధవారం గురుద్వారా దరి ఏపీఈపీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. తక్షణం విద్యుత్ సరఫరా అందించాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి పడాల రమణ మాట్లాడుతూ హుద్‌హుద్ బాధితుల కోసం బక్కన్నపాలెంలో 320 కుటుంబాలకు నూతనంగా ఇళ్లు నిర్మించారన్నారు. అందులో 151 కుటుంబాలను గుర్తించి వెరిఫికేషన్ చేసి డ్రా తీసి ప్రభుత్వం పట్టాలు ఇచ్చిందని తెలిపారు. ఈ హౌసింగ్ కాలనీలో విద్యుత్ సదుపాయం లేక ఇళ్లలోకి పాములు, విషపురుగులు రావడంతో పిల్లలతో భయభ్రాంతులకు గురవుతున్నట్లు చెప్పారు. వెంటనే విద్యుత్ సరఫరా ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో కె.చిన్నా, సరోజిని, అనురాధ, బోగేష్, శ్రీను, రాజు, కాలనీ ఇళ్ల లబ్ధిదారులు పాల్గొన్నారు.



ఏపీఈపీడీసీఎల్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న బక్కన్నపాలెం కాలనీవాసులు

బాల్య వివాహాలతో పిల్లల భవిత అంధకారం

మధురవాడ : బాల్య వివాహాలతో పిల్లల బంగారు భవిష్యత్ అంధకారంలోకి నెట్టేసినట్టు అవుతుందని, 18 ఏళ్లు నిండకుండా యువతులకు వివాహాలు చేయడం నేరమని ఐసీడీఎస్ మధురవాడ సెక్టార్ సూపర్‌వైజర్ ఎ.లక్ష్మి అన్నారు. బాల్య వివాహాలు వల్ల కలిగే అనర్థాలపై మిషన్ శక్తి కార్యక్రమంలో భాగంగా వాంబేకాలనీ పరిసర ప్రాంతాల్లో బుధవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలికలకు చిన్న వయస్సులోనే వివాహాలు చేయడం వల్ల అనేక ఇబ్బందులు ఎదురవుతాయన్నారు. పిల్లల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని తల్లిదండ్రులు బాల్య వివాహాలు చేయకూడదన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు సాంఘిక దురాచారాలపై స్థానికులకు అవగాహన కల్పించాలని లక్ష్మి సూచించారు. మిషన్ శక్తి కార్యక్రమంలో 100 రోజులపాటు పర్యావరణం, బాల్య వివాహాలు, పౌష్టికాహారం తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించాల్సి ఉంటుందన్నారు. మధురవాడ పరిధిలోని 23 కేంద్రాలకు చెందిన అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. వారంతా నెలవారీ చేపట్టాల్సిన కార్యక్రమాలపై లక్ష్మి దిశానిర్దేశం చేశారు. అనంతరం ప్లకార్డులు, బ్యానర్ పట్టుకుని కాలనీలో ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పించారు.



మధురవాడలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

150 మందికి ఉచిత వైద్య సేవలు

తగరపువలస : ఆనందపురం మండలం ముచ్చర్లలో జిల్లా సత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో బుధవారం ఉచిత సాధారణ, కంటి వైద్య శిబిరంలో 150 మందికి సేవలు అందించారు. వీరిలో 40 మంది హైరిస్క్ వ్యాధి బాధితులు ఉన్నట్లు నిర్వాహకులు తెలిపారు. నలుగురికి శస్త్రచికిత్సలు అవసరమని గుర్తించారు. శిబిరాన్ని జిల్లా అధ్యక్షుడు పి.ఆర్.ఎస్.ఎన్.నాయుడు ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా మాజీ అధ్యక్షుడు నాగేశ్వరరావు, జోన్ కో ఆర్డినేటర్ సత్యసాయి, గొట్టిపల్లి భజన మండలి కన్వీనర్ కోరాడ తమ్మినాయుడు, డి.అప్పలరాజు, జిల్లా సేవల కో ఆర్డినేటర్ ఆర్యానాయుడు, మెడికల్ కో ఆర్డినేటర్ సాయికుమార్, సర్పంచ్ ఎర్నాయుడు, షిణగం శివ పాల్గొన్నారు.



ముచ్చర్లలో వైద్య సేవలు అందిస్తున్న సిబ్బంది

మనిషి ఆరోగ్యంపై మ్యూజిక్ థెరపీ ప్రభావం

కొమ్మాది : మనిషి భావోద్వేగాలు, మెదడును చైతన్య పరచడం, ప్రవర్తనలో మార్పులను సంగీతం ప్రభావితం చేస్తుందని, ముఖ్యంగా మ్యూజిక్ థెరపీకి మనిషి ఆరోగ్యాన్ని సరిచేసే శక్తి ఉందని ఇండియన్ మ్యూజిక్ థెరపీ అసోసియేషన్ అధ్యక్షుడు టీవీ సాయిరాం అన్నారు. గీతంలో ఫైన్ పెర్ఫార్మింగ్ ఆర్ట్స్ విభాగం ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన ఓ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రమ పద్ధతిలో వెలువడే ధ్వని మానవ మెదడుపై ప్రభావం చూపుతుందన్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం సంగీత, నృత్య విభాగ చైర్మన్ కె.సరస్వతి, తదితరులు పాల్గొన్నారు.

ఓల్టేజీ హెచ్చుతగ్గులతో అవస్థలు



ఓల్టేజీ హెచ్చు తగ్గులకు కారణమైన ట్రాన్స్‌ఫార్మర్

మధురవాడ : జీవీఎంసీ 6వ వార్డు చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సమీపంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ సక్రమంగా పనిచేయకపోవడంతో ఓల్టేజీ హెచ్చు తగ్గులతో విద్యుత్, గృహోపకరణాలు పాడైపోతున్నాయని స్థానికులు వాపోతున్నారు. ఈ ట్రాన్స్‌పార్మర్ నుంచి ఒక్కోసారి న్యూట్రల్ నుంచి కూడా కరెంటు వచ్చేస్తోందని ఆందోళన చెందుతున్నారు. ఇక్కడ ఉన్న దుకాణాల్లో విలువైన సామగ్రి కూడా పాడైపోతోందని వాపోతున్నారు. తరచూ ఇక్కడ ఇలాంటి సమస్యలు ఎదురవుతున్నాయని అధికారులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. కనీసం ఉన్నతాధికారులైనా తక్షణమే స్పందించి చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న సీపీ

తగరపువలస : విధుల నిర్వహణలో నిర్లక్ష్యం వహించినా, అధికార దుర్వినియోగానికి పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటానని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి హెచ్చరించారు. బుధవారం సాయంత్రం ఆయన ఆనందపురం పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా సిబ్బందితో మాట్లాడుతూ నిర్మానుష్య ప్రదేశాలు ఎక్కువగా ఉన్న స్టేషన్ పరిధిలో దొంగతనాలు, అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా క్రైం పోలీసులు పోలీసింగ్ చేయాలన్నారు. సీసీ టీవీ కెమెరాలను వినియోగించుకుని చర్యలు చేపట్టాలన్నారు. రౌడీ షీటర్లు, సస్పెక్ట్ షీటర్ల కదలికలను ఎల్లవేళలా పరిశీలించాలన్నారు. గంజాయి రవాణాదారులను అరెస్ట్ చేయాలన్నారు. స్టేషన్ పరిధిలో ఒక్క గంజాయి పెడ్లర్ ఉండకూడదని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. సిబ్బందికి ఏవైనా సమస్యలుంటే తెలపాలన్నారు. కొన్ని సమస్యలను తక్షణమే పరిష్కరించి చర్యలు తీసుకున్నారు. సిబ్బందికి ఎలాంటి సమస్యలున్నా 7995095799 నంబరుకు తెలియజేయాలన్నారు. స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులను కూర్చోబెట్టి మర్యాదపూర్వకంగా వారి సమస్యలు త్వరితగతిన పరిష్కరించాలన్నారు. స్టేషన్ ఆవరణలో లైటింగ్ ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. క్రైం పోలీస్ స్టేషన్ ఆవరణలో సీజ్ చేసిన వాహనాలు పాడవకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఖాళీ ప్రదేశంలో శుభ్రం చేసి మొక్కలు నాటాలన్నారు. టాయిలెట్లను నిత్యం పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. పెండింగ్ సమస్యలను తక్షణమే పరిష్కరించి రిజిస్టర్ అప్‌డేట్‌గా ఉంచాలని ఆదేశించారు.



పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలిస్తున్న సీపీ శంఖబ్రత బాగ్చి, స్థానిక పోలీసు అధికారులు

గ్రామ దేవతలకు ఆషాఢమాస సారె సమర్పణ



నారింజపండ్ల అలంకరణలో సుత్తమ్మతల్లి



ప్రత్యేక అలంకరణలో రాస పోలమాంబ



మజ్జివలసలో ఊరేగింపుగా సారె తీసుకొస్తున్న మహిళలు, గ్రామ పెద్దలు

తగరపువలస : భీమిలి మండలం చిప్పాడ, మజ్జివలస, టి.నగరపాలెం గ్రామ పంచాయతీల్లో బుధవారం ఏకాదశి సందర్భంగా గ్రామ దేవతలకు ఆషాఢమాస సారె భక్తి శ్రద్ధలతో సమర్పించారు. వందలాది మంది మహిళలు తలపై పళ్లాలతో స్వీట్లు, అరిసెలు, కలశాలు, పండ్లు, ఫర్నీచర్, చీరలు తదితర సామగ్రిని బాణసంచా, డీజే, కోలాటం వంటి హంగామాతో ఊరేగింపుగా తీసుకెళ్లి సమర్పించారు. ముందుగా ఆయా గ్రామాల్లో అమ్మవారి చదురు వద్ద వాటిని సమర్పించి తర్వాత అక్కడి నుంచి ఆలయాల వద్దకు తీసుకెళ్లారు. ఈ సందర్భంగా చిప్పాడ సుత్తమ్మతల్లిని నారింజ పండ్లు, మజ్జివలస రాస పోలమాంబ, టి.నగరపాలెం ఎల్లారమ్మను ప్రత్యేక పూలతో అలంకరించారు. ఈ సందర్భంగా అమ్మవార్లకు పంచామృతాలతో అభిషేకాలు, మహా నీరాజనం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భారీగా ప్రసాదాలు, తాగునీరు పంపిణీ చేశారు. భక్తులంతా అమ్మవార్లకు మొక్కులు చెల్లించుకున్నారు.



చిప్పాడలో అమ్మవారికి భక్ష్యులు సమర్పించిన సారె వద్ద కమిటీ సభ్యులు

హిందీ సాహిత్యంలో నవలా చక్రవర్తి మున్షీ ప్రేమ్ చంద్



మున్షీ ప్రేమ్‌చంద్‌కు నివాళులర్పిస్తున్న హిందీ విద్యార్థులు, తదితరులు

తగరపువలస : హిందీ సాహిత్యంలో నవలా చక్రవర్తిగా మున్షీ ప్రేమ్‌చంద్‌కు పేరు ప్రఖ్యాతలున్నాయని భీమిలి ఆదర్శ ప్రేమీ మండలి అధ్యక్షుడు కె.ఎస్.ఆర్.కృష్ణారావు, గౌరవ అధ్యక్షుడు గంటా నూకరాజు అన్నారు. ప్రేమ్‌చంద్ 144వ జయంతి సందర్భంగా బుధవారం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పేదరిక జీవితాన్ని గడిపిన ఆయనకు ఉర్దూ, పర్షియన్ భాషలలో కూడా ప్రవేశం ఉందన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు | వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు | శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

భీమిలి

✆ 9912220753

Office mail : sakshiadvtvsp@gmail.com